క్లుప్తంగా

ఓటర్ల జాబితాపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం

వేమూరు: ఓట్లు నమోదుపై వివిధ పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గం ఎన్నికల ప్రత్యేకాధికారి, ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జె.మోహన రావు తెలిపారు. వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల నమోదుకు, తొలగింపుపై అభ్యంతరాలు ఉంటే దృష్టికి తీసుకొని రావాలని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొల్లిముంత ఏడుకొండలు, దొప్పలపూడి జ్యోతిబాబు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్తికమాసం ప్రత్యేక పూజలు



బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పి అగ్రహారం గంగాపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో కార్తికమాసం పురస్కరించుకుని బుధవారం, ప్రాతఃకాల విశేష అభిషేకాలు అనంతరం స్వామివారు విశేష అలంకరణలో 'శివవర్ణాంబరుని'గా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట శివ వరప్రసాద్, గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణలు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు.

తుఫాన్ బాధితులకు అన్నదానం



బాపట్ల అర్బన్: బాపట్ల 11వ వార్డు రాజీవ్ కాలనీలోని తుఫాన్ బాధితులకు దయానంద స్టీల్స్ దమ్ము దయానందరావు ఆధ్వర్యంలో బుధవారం ఏసుక్రీస్తు కృపా మందిరంలో 400 మందికి ఆహారం అందజేశారు. దయానంద రావు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా చాలా మంది ఇళ్లు మునిగిపోవడం వలన వారందరికీ బుధవారం అన్నదానం నిర్వహించామన్నారు. సీమియోన్, సర్వోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌లోనూ విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన నల్లమోలు సీతా మహాలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో కుమారుడు సుబ్బారావు వద్ద ఉంటోంది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రైళ్లను రద్దు చేయడంతో తాను రాలేనని వలంటీర్ కర్రా లాజర్‌కు తెలియపరిచారు. స్పందించిన వలంటీర్ మంగళవారం ఆర్టీసీ బస్సులో భట్టిప్రోలు నుంచి విజయవాడలో కుమారుడి వద్ద ఉంటున్న సీతా మహాలక్ష్మి వద్దకు వెళ్లి ఫించన్ అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్ లాజర్‌కు వృద్ధురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి



భట్టిప్రోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి హనుమంతరావు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాచూరులో పంటలను పరిశీలించిన హనుమంతరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పించేందుకు ఇప్పటికే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట పొలాలను పరిశీలించారని తెలిపారు. ఐలవరంలో రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్‌తో కలసి పంటలను ప్రజా ప్రతినిధులు పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఏఓ జి. మీరయ్య, సర్పంచ్ జయవరపు రాధాకృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ తదితరులు ఉన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- వలు గ్రామాల్లో పంటపొలాల సందర్శన

కర్లపాలెం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు, గృహాలు ధ్వంసమైన యజమానులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతి యాజలి, కర్లపాలెంలోని పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులకు భోజనం వడ్డించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. అనంతరం సత్యవతీపేట, బుద్ధాం, చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, కర్లపాలెం, యారంవారిపాలెం గ్రామాలలో నీట మునిగిన వరి, పచ్చిమిర్చి, మినుము పైర్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు సాధ్యమైనంత వరకు పంటలను కాపాడుకోవాలని నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వపరంగా నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని చెప్పారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్ ముందస్తుగానే పంట నమోదు చేయించి ప్రభుత్వమే నగదు చెల్లించి పంటల బీమా చేయించారని చెప్పారు. కర్లపాలెం మండలంలో అధికంగా వరి, కొంతమేరకు పచ్చిమిరప, వేరుశనగ, మినుము పైర్లు సాగులో ఉన్నాయని తుఫాన్ వర్షాలకు నీట మునిగాయని నష్టం అంచనా వేయించి పరిహారం అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, డీపీఓ డి.రాంబాబు, తహసీల్దార్ జి.కేశవనారాయణరావు, నాయకులు ఉన్నారు.

వరి, అరటి, మినప పంటలకు నష్టం

కొల్లూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను తాకిడికి రైతాంగం కుదేలయ్యింది. మంగళవారం తుపాను తీరం దాటిన అనంతరం సంభవించిన పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుధవారం వాతావరణం ప్రశాంతంగా ఉండటంతో రైతాంగం తడిచిన పంటలను ఆరబెట్టుకుని కాపాడుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేపట్టారు. మండలంలోని లంక గ్రామాలలో సాగులో ఉన్న అరటి, మినప పంటలపై సైతం తుపాను ప్రభావం పడింది. మంగళవారం రాత్రి వీచిన గాలుల కారణంగా మండలంలోని కృష్ణా పరివాహక గ్రామాలైన చింతర్లంక, సుగ్గునలంక, ఈపూరులంక, ఈపూరు, చిలుమూరు, పోతార్లంక, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాలలో సుమారు 300 ఎకరాల వరకు అరటి తోటలు గాలికి విరిగి పడ్డాయి. కోత దశకు చేరుకున్న సుమారు 200 ఎకరాల్లోని మినప పంట వర్షపు నీట ముంపుకు గురవ్వడంతో మినప పంటకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు..

ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలోని వెంకట్రాజు నగర్‌లో తుఫాన్ ధాటికి మంగళవారం రాత్రి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం వెంకట్రాజు నగర్‌లో రహదారికి అడ్డుగా పడిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలను గ్రామ సర్పంచ్ మేరుగ రంగారావు, పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీదేవిలు సిబ్బందిచే తొలగింపు చేశారు. అలాగే మండల కేంద్రమైన భట్టిప్రోలు గర్డర్ బ్రిడ్జి వద్ద భారీ వృక్షం వెల్లటూరు ఛానల్‌లోకి నేలవాలింది. మండలంలోని భట్టిప్రోలు, పెదపులివర్రు పరిధిలో 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని సుమారు రూ. 3 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ ఏడీఏ నెమలికంటి భాస్కరరావు తెలిపారు.

సహాయక చర్యలో అధికార యంత్రాంగం..

కొల్లూరు: అన్నదాతలకు మిచాంగ్ తుపాను కలిగించిన నష్ట తీవ్రతను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మంగళవారం భారీ వర్షం కారణంగా వరి, అరటి, మినప పంటలకు నష్టం వాటిల్లింది. వర్షపు నీరు నిల్వ ఉండటం కారణంగా వరి, మినప పంటలు ఎందుకు పనికొచ్చే అవకాశం లేదన్న అంశాన్ని గ్రహించిన అధికారులు యుద్ధప్రాతిపధికన వర్షపు నీటిని బయటకు మళ్లించేందుకు నడుం కట్టారు. కొల్లూరు మండల ప్రత్యేకాధికారి రమణ, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావులు పొక్లెయిన్ల సాయంతో పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వేగవంతంగా బయటకు తరలించేందుకు డ్రైన్లలో పూడికతీత పనులను చేపట్టి పర్యవేక్షణ చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు సైతం రైతాంగాన్ని ఆదుకునేందుకు అధికార యంత్రాంగానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ వర్షపు నీటి తరలింపు పనుల్లో చేదోడు వాదోడుగా నిలిచారు. కొల్లూరు మండలంలో 14 గ్రామాల పరిధిలో 420 మంది ఉపాధి హామీ కూలీలు 5,250 ఎకరాల పరిధిలో నీటి తరలింపు పనులను రైతులు, ఆర్‌బీకే సిబ్బంది సహాయ సహకారాలతో పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తరలించి పంట నష్ట తీవ్రతను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందిని వినియోగించడం కారణంగా 3 వేల ఎకరాల్లోని వరి, 2,250 ఎకరాల్లోని ఉద్యానవన పంటల్లోని వర్షపు నీరు సులువుగా బయటకు వెళ్లే సౌకర్యం ఏర్పడింది.

బియ్యం, కూరగాయలు వితరణ..

పిట్లలవానిపాలెం: తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధితులకు కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ సర్పంచ్ మాడా సుబ్రమణ్యం సాయమందించారు. మండలంలోని చందోలు శివారు ఈద్గా సమీపంలో నివాసముంటున్న 150 ఎస్టీ కుటుంబాల వారికి బియ్యం, కూరగాయలు అందజేశారు. మౌలాలి, కొండవీటి శ్రీనివాసరావు ఉన్నారు.

ఐలవరంలో పునరావాస కేంద్రం

ఐలవరం(భట్టిప్రోలు): తుపాను ప్రభావంతో అధికారులు తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఎస్టీ కాలనీ వాసుల కోసం ప్రత్యేకంగా రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందు కోసం స్థానిక సచివాలయం-2, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలలో 26 కుటుంబాలు తలదాచుకున్నాయి. మంగళవారం నుంచి బుధవారం వరకు ఈ పునరావాస కేంద్రం కొనసాగింది. పరిస్థితి యథాస్థితికి రావడంతో ప్రతి కుటుంబానికి రూ. 2500 నగదు, నిత్యవసరాలు అందించారు.

పకడ్బందీగా పంట నష్టం అంచనాలు...

కొల్లూరు: మించాంగ్ తుపాను వల్ల సంభవించిన పంటనష్టం పరిహార అంచనాల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించనున్నట్లు వ్యవసాయ, ఉద్యానవన శాఖ జిల్లా అధికారులు షేక్ అబ్దుల్ సత్తార్, జెన్నమ్మలు అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా నష్ట పరిహారం అంచనాలు జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు. మంగళవారం మండలంలోని క్రాప అడ్డరోడ్డు వద్ద డీఏఓ షేక్ అబ్దుల్ సత్తార్ తుపాను కారణంగా ముంపునకు గురైన వరిపంటను డీఏఓ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా వరి పంట నష్టాన్ని అంచనా వేయడానికి బృందాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. పంట నష్ట అంచనా బృందాలు వచ్చిన సమయంలో పంట దెబ్బతిన్న రైతులు తమ పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలోని సుగ్గునలంక, చింతర్లంక, ఈపూరులంక గ్రామాలలో ఉద్యానవన శాఖ ఏడీ పి.జెన్నమ్మ గాలివాన కారణంగా విరిగిపోయిన అరటి తోటలు, నీటి ముంపునకు గురైన పసుపు పంటలను పరిశీలించారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది..

బాపట్ల: మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని అడవిపల్లిపాలెంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. తుఫాన్‌తో నష్టపోయిన వారినికి ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ జి.రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, కోదండం తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో సాయం..

నిజాంపట్నం: సేవా కార్యక్రమాల్లో యూటీఎఫ్ ముందుండటం హర్షణీయమని తహసీల్దార్ నెహ్రూబాబు తెలిపారు. మించాంగ్ తుఫాను ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న 60 ఎస్టీ కుటుంబాలకు యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, తినుబండారాలు, సామగ్రిని అందించారు. తహసీల్దార్ నెహ్రూబాబు చేతులమీదుగా సాయం అందజేశారు. ఎంపీడీఓ నాగలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య, మండల అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ గణేష్‌రావు పాల్గొన్నారు.

తూటికాడ తొలగింపు

గోవాడ(వేమూరు): పంట పొలాల్లో వర్షం నీరు త్వరగా బయటకు పంపించేందుకు పంట కాల్వల్లో తూటి కాడ తొలగించడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి కె.దేవరాజు తెలిపారు. అమర్తలూరు మండలంలో తుఫాన్ వల్ల రెండు రోజుల్లో కురిసిన వర్షం వల్ల వరి పొలాలు మునిగి పోవడం జరిగిందన్నారు. పంట కాలువల్లో పెరిగిన తూటికాడను ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎంపీడీఓ షేక్ సుభాని, ఇరిగేషన్ ఏఈ శిరిషా తదితరులు పాల్గొన్నారు.



దమ్మనవారిపాలెంలో ఎమ్మెల్యే కోన రఘుపతికి మినుము పైరు చూపిస్తున్న రైతులు



కొల్లూరు మండలం క్రాపలో పొలాల్లో నిలిచిన నీరు డ్రెయిన్ల ద్వారా ప్రవహించేందుకు వీలుగా పొక్లెయిన్‌తో పూడికతీయిస్తున్న అధికారులు



క్రాప అడ్డరోడ్డు వద్ద వరిపంటను పరిశీలిస్తున్న డీఏఓ షేక్ అబ్దుల్ సత్తార్



గోవాడ పంటకాలువలో తూటికాడ తొలగిస్తున్న ఉపాధి కూలీలు



ఐలవరం పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు



మత్స్యకారులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన..

భట్టిప్రోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి అబ్దుల్ సత్తార్‌లు పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి వీరు మండలంలో రాచూరు, పల్లెకోన, ఐలవరం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

రైతులు అధైర్యపడొద్దు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నగరం: రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు భరోసా నిచ్చారు. మండలంలోని సజ్జావారిపాలెం, నగరం, చినమట్లపూడి గ్రామాలలో నేలకొరిగిన, నీటిలో నానుతున్న వరి పంట పొలాలను బుధవారం ఎంపీ మోపిదేవి పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ తుఫాను ప్రభావంగా రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారని రైతులకు తగిన పరిహారం అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేవిధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తుందన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, ప్రత్యేకాధికారి సైదానాయక్, తహసీల్దార్ ఎం.ప్రమీల, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగరంలో పునరావాస కేంద్రం



పునరావాస కేంద్రంలో భోజనాలు ఏర్పాటు చేసిన దృశ్యం

వేమూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు ఇళ్ల లోకి నీరు చేరడంతో అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వేమూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగరంలో 54 మంది సంచార జాతులవారు నివసిస్తున్నారు. వారి ఇళ్లలోకి నీరు చేరడంతో రెవెన్యూ అధికారులు, వలంటీర్లు బాధితులకు స్థానికంగా ఉన్న ఓ చర్చిలో పునరావాసం కల్పించారు. బుధవారం పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున సందర్శించి బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అదేవిధంగా కేంద్రంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కేంద్రంలో ఉన్నవారందరికీ మంచి భోజనసౌకర్యం ఏర్పాటు చేశామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్ తెలిపారు. స్థానిక వలంటీర్ గోపి బాధితుల ఇళ్లలోకి నీరు చేరడంతో వెంటనే రెవెన్యూ అధికారులు దృష్టి తీసుకొని వచ్చారని ఆయన తెలిపారు. వెంటనే బాధితులను చర్చికి తరలించడం జరిగిందని ఆయన చెప్పారు.

బాధితులను గుర్తించి, అధికారులకు సమాచారం ఇచ్చాను



అంబేడ్కర్ నగరంలో సంచార జాతుల వారు నివసిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం వల్ల వారి ఇళ్లలోకి నీరు చేరడం గుర్తించి మండల రెవెన్యూ అధికారుల దృష్టి తీసుకెళ్లడం జరిగింది. అధికారులు రాక ముందే బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగింది.

– కె.గోపి, వలంటీర్, అంబేడ్కర్ నగరం, వేమూరు

భారతరత్న అంబేడ్కర్ సేవలు నిరుపమానం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- వర్ధంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘననివాళి

రేపల్లె: అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు నిరంతరం పోరాడి బడుగు, బలహీనవర్గాల హక్కులు సాధించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని చోడాయపాలెంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి భానుకోటి, మేడికొండ సుధాకర చంద్రహాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని పెదపులివర్రులో అంబేడ్కర్ విగ్రహానికి కూడా ఎంపీపీ పూలమాలలు వేశారు. కార్యక్రమాలలో ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి, పంచాయతీరాజ్ ఎఈ శేతు రామచంద్రరరావు, పార్టీ నేతలు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, అంబేడ్కర్ యూత్, సంఘ పెద్దలు కె.సూర్యచంద్రరరావు, పి.పెద్దబాబు, పి.సుబ్బారావు, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భట్టిప్రోలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. ఆర్ఎంపీ వైద్యులు గాలి ప్రవీణ్‌కుమార్, యూత్ నాయకులు నీలా నానీ, జడా రవీంద్రబాబు, పెరికల రాజశేఖర్, కనపర్తి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి డాక్టర్ అంబేడ్కర్..

పిట్లలవానిపాలెం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని అంబేడ్కర్ బహుళార్థ సేవాసమితి అధ్యక్షుడు కంచర్ల అవినాష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ బహుళార్థ సేవాసమితి సభ్యులు గొర్రుముచ్చు ఆనందరావు, పాల్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి ...

రేపల్లె: సమసమాజ స్థాపనకు అంబేడ్కర్ సేవలు ఎనలేనివని మాల ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు దర్శి భాస్కరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. సభ్యులు కె.రాంబాబు, దారం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం పట్టణ అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, నాయకులు పాల్గొన్నారు. జైభీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్ రాంజీ పాల్గొన్నారు.

కొల్లూరులో...

కొల్లూరు: వెనుకబాటుతనం రూపుమాపాలంటే ప్రతిఒక్కరూ విద్యా వంతులు అవ్వాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కొల్లూరు ఎస్సీ ఏరియాలో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, నాయకులు అయిల సుబ్బారావు, కూచిపూడి మోషే, కనపర్తి మోహన్‌రావు, రమేష్, చిలకా ప్రకాశం, కట్టుపల్లి సోమయ్య పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నతుడని, ఆయన రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాలకంటే ఉన్నతమైనదని నియోజక వర్గ ఎన్నికల పత్యేకాధికారి మోహనరావు తెలిపారు. వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ నాగరాజు, జ్యోతి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శం..

కర్లపాలెం: భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శవంతమైనవని ఎంపీపీ యారం వనజ అంబేడ్కర్ యువజన సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ తెలిపారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ యారం వనజ మండల పరిషత్ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య సభ్యులు కర్లపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చోడాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి



రేపల్లెలో నివాళులర్పిస్తున్న మాల ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం నాయకులు

పంట నష్టం అంచనాలు త్వరగా పూర్తి చేస్తాం

- జిల్లాలో 78వేల హెక్టార్లలో పంటలు నీట మునిగాయి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్లపాలెం: తుఫాన్ ప్రభావంతో వరి పంటకు భారీగా నష్టం వాటిల్లిందని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతితో కలసి ఆయన సత్యవతీపేట, కర్లపాలెంలో నీట మునిగిన వరి, పచ్చిమిర్చి పైర్లను పరిశీలించారు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వ పరంగా అందుతున్న సహాయక చర్యలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలోని తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయంగా ఒక్కో కుటుంబానికి ఇచ్చే రూ.2,500, బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 78వేల హెక్టార్లలో పంటలు నీటమునిగినట్లు అంచనా వేశామని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో, పూరిగుడిసెలలో నివాసం ఉంటున్న వారికి 74పునరావాస కేంద్రాలలో ఆశ్రయం కల్పించామని చెప్పారు. ముందస్తు చర్యలు తీసుకోవటం ద్వారా ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగామని చెప్పారు. తీర ప్రాంతంలో 24గంటలలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 32 గృహాలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారని ఆయన చెప్పారు. జిల్లాలో పంట నష్టం అంచనాలు త్వరగా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించటం ద్వారా నష్ట పరిహారం అందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన నష్ట పోయిన వారిని ముఖ్యమంత్రి ఆదుకుంటారన్నారు. జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, జిల్లా వ్యవసాయశాఖాధికారి అబ్దుల్ సత్తార్, ఆర్డీఓ జి.ర వీందర్, ఏడీఏ లక్ష్మి, తహసీల్దార్ కేశవ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, ఏఓ సుమంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ''బేసిక్ లైఫ్ సపోర్ట్'' అనే అంశంపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు.

• అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్లపాలెం: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కర్లపాలెం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.